క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వాడ్రాపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపార. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని వాడ్రాపల్లిలో గురువారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి శ్రీలక్ష్మి,వార్డు సభ్యుడు సూరిశెట్టి రాము, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



తోటాడ శ్మశానవాటికలో చేపట్టిన అభివృద్ధి పనులు

మునగపాక: తోటాడ శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. శ్మశానవాటికలో జేసీబీ సాయంతో గురువారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒక వైపు ప్రహరీ గోడ నిర్మించామని ఇతర అవసరాలకు ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ,ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నాయుడు

ఎస్.రాయవరం:డెంగ్యూ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.నాయుడు తెలిపారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తరేవుపోలవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ సోకకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి సోకితే సకాలంలో చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది ఎన్.దేవరాజు,శ్రీనివాస్,ప్రసాద్, అశోక్, రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

మునగపాక: జీవామృతం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించవచ్చని బీసీటీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ డైరెక్టర్ వినోద్ అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో గురువారం బీసీటీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. నాటు ఆవు మూత్రం, పేడ, రెండు కిలోల బెల్లం,రెండు కిలోల పప్పుల పిండి,పుట్ట మన్నుతో జీవామృతం తయారు చేసుకోవచ్చన్నారు.రూ.250 పెట్టుబడితో ఎకరాకు సరిపడే జీవామృతం తయారవుతుందని చెప్పారు. ప్రతి వారం లేదా పదిహేను రోజులకొకసారి నేలకు జీవామృతం అందించడం లేదా పిచికారీ చేయడం వల్ల మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో బీసీటీ సమన్వయ కర్త సీతారామరాజు,పవన్,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మునగపాక: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు.ఈ మేరకు అరబుపాలెం సచివాలయంలోని అధికారులకు గురువారం వినతి అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆడారి నీలకంఠరావు,దొడ్డి కృష్ణ, రామచంద్రరావు,ఆడారి కొండలరావు,జగదీశ్వరరావు,నాగేశ్వరరావు తదితరులున్నారు.

పాఠశాలల్లో సందడే సందడి



పందూరు ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థుల కోలాటం



మార్టూరులో నిర్వహిస్తున్న ఖో - ఖో పోటీలు

కోటవురట్ల: ప్రభుత్వం పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించేందుకు ఆటలు ఆడిస్తున్నారు. గురువారం నాల్గవ రోజు కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల్లో విద్యార్థులతో సంప్రదాయ నృత్యాలు చేయించారు. విద్యార్థులు ఉత్సాహంగా కోలాటం ఆడి సందడి చేశారు. కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజుపేట ఎంపీయూపీ స్కూల్, బోడపాలెం ఎంపీయూపీ స్కూల్, పందూరు ఎంపీయూపీ స్కూల్, గొల్లపేట ఎంపీపీ స్కూళ్లలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు

నక్కపల్లి : జాతీయ నూతన విద్యావిధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులు ఈ క్రీడా పోటీలు జరుగుతాయని ఆయన చెప్పారు. ప్రతి పాఠశాలలోను ఈ కార్యక్రమాలను నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించినట్టు తెలిపారు.

మార్టూరులో

అచ్యుతాపురం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా అచ్యుతాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా దినోత్సవం నిర్వహించారు.గురువారం మార్టూరు ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన ఆటల



ఆటల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

పోటీలను ఎంఈవో దేవరాయలు ప్రారంభించారు.హెచ్‌ఎం కె.మురళీకృష్ణ,ఉపాధ్యాయులు సూర్యలక్ష్మి,విద్యా సాగర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి సహకరించాలి



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయానికి అవసరమయ్యే విరాళాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి మునగపాకకు చెందిన వెలదా ధర్మసూరి అప్పారావు, లీలావతి దంపతులు రూ.10,119, పెంటకోట సూరిబాబు రూ.5,116, వెలగా సూర్యవెంకట జగన్నాథం, ప్రభ దంపతులు రూ.10,116,విశాఖకు చెందిన యల్లపు శ్రీరాములు రూ.25వేలు, ఆడారి జగన్నాథరావు రూ.5వేలు, దాడి వెంకటరావు రూ.5,116,బొడ్డేడ దుర్గునాయుడు రూ.5వేలు, వెలగా పైడితల్లమ్మ రూ.5వేలు,వెలగా జగ్గప్పారావు జ్ఞాపకార్థం కుమారుడు అప్పలనాయుడు రూ.5వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మళ్ల సంజీవరావు,సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు,అలంక సూర్యప్రకాశరావు,వెలగా శ్రీనివాసరావు, ఆడారి రాజు, విల్లూరి నూక నరసింగరావు,వీడీఎం నాయుడు,పూసర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: మండలంలోని వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మెయింటైనెన్స్‌లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. రామారాయుడుపేట, టి.సిరసపల్లి, వెంకటాపురం, తోటాడ, గవర్ల అనకాపల్లి,నారాయుడుపాలెం తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని రామకృష్ణ కోరారు.

నేడు నీటి సరఫరా బంద్

యలమంచిలి రూరల్: పట్టణంలోని పలు వార్డులకు శుక్రవారం నీటి సరఫరా ఉండదని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ డి ప్రభాకరరావు తెలిపారు.పట్టణానికి మంచి నీటిని సరఫరా చేసే ప్రధాన వనరు అయిన సోమిదేవపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం వల్ల ప్రధాన సంప్‌లకు నీటి సరఫరా జరగలేదని, దీంతో ఈ సమస్య తలెత్తిందని చెప్పారు.శుక్రవారం పట్టణంలోని 9వ వార్డు నుంచి 14వ వార్డులు,19వ వార్డులకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.నీటి సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే మున్సిపల్ ఇంజినీర్ ఫోన్ నంబర్ 7337224407, అసిస్టెంట్ ఇంజనీర్ ఫోన్ 7893795365 నంబర్లకు కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మూలజంపలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు

రాంబిల్లి (యలమంచిలి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూచించారు.రాంబిల్లి మండలం మూలజంపలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులతో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దిమిలి పీహెచ్‌సీ విస్తరణాధికారి ఎస్.వి.ఎన్ రాజు మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల వల్ల మలేరియా,డెంగ్యూ తదితర వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని తెలిపారు. కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, శరీరం పై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలు ఉన్నా,తొడలు, కాళ్లు, చేతుల కండరాలలో నొప్పిగా అనిపించినా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిమిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, హై స్కూల్ హెచ్‌ఎం జగదీష్,పాఠశాల సిబ్బంది ఈదరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబ అమ్మవారు



గ్రామంలో ఘటాల ఊరేగింపు

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మరిడిమాంబను దర్శించుకోవానికి తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చురుగ్గా పారశుధ్య డ్రైవ్



చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నాయకులు

కోటవురట్ల: ఉన్నతాధికారుల ఆదేశాలతో జల్లూరు, కోటవురట్లలో గురువారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. కోటవురట్ల ప్రధాన కూడలి, ముస్లిం వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పొక్లెయిన్‌తో పొదలను తొలగించారు. రక్షిత మంచినీటి పథకాలలో క్లోరినేషన్ చేశారు. జల్లూరు మెయిన్‌రోడ్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎంపీటీసీ పుత్రేవు వెంకట సూర్యారావు, కో ఆప్షన్ మెంబర్ షేక్ ఖుదా బాషా, వార్డు మెంబరు ఖాసిం పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ



తంగేడులో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కోటవురట్ల: పల్లెల్లో గురువారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆషాఢమాసంలో అమ్మవార్లకు సారె సమర్పించడం ఆనవాయితీ. తంగేడులో గ్రామస్తులంతా బోనాలతో ఊరేగింపు నిర్వహించి తలుపులమ్మతల్లికి సారె సమర్పించారు. యండపల్లి, కోటవురట్ల, కైలాసపట్నం తదితర పలు గ్రామాలలో అమ్మవార్లకు సారె సమర్పించారు. తలుపులమ్మతల్లి ఆలయం వద్ద భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రసాద వితరణ, అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్, ఉప సర్పంచ్ ఆర్.ఎస్. లక్ష్మీనరసింహరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్.ఎస్. నారాయణమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్ష చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి

కోటవురట్ల: పాములవాకలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి మంచి స్పందన వచ్చిందని, సుమారు 100 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని శ్రీనివాసరావు తెలిపారు.

హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

నర్సీపట్నం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా గబ్బాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య కోసం నర్సీపట్నం స్టేట్ బ్యాంక్ ప్రధాన శాఖ మేనేజర్ జె.వి. రాఘవరావు దంపతులు రూ.30 వేలు విలువ చేసే డెస్క్‌టాప్ కంప్యూటర్‌ను బహూకరించారు. దీన్ని సర్పంచ్ రాజేశ్వరి, హెచ్.ఎం సత్యనారాయణ(కిట్టు)లకు గురువారం అందజేశారు. మధ్యాహ్న భోజనం చేసే 180 విద్యార్థులకు సర్పంచ్ మిఠాయిలు పంచిపెట్టారు.

ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. గురువారం ఆయన బి.కె.పల్లిలోని గ్రామ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ధర్నా

అనకాపల్లి: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ కాలానుకూలంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేలా వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు, మారుతున్న ప్రతిసారీ విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. గాంధీనగర్ ఎస్సీ కాలేజీ హాస్టల్‌కు కొత్త భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో ఖాళీ పోస్టుల్ని త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. అనకాపల్లి నుంచి నర్సీపట్నం, తట్టబందకు వెళ్లే బస్సుల సంఖ్య పెంచాలని కోరారు.

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి (యలమంచిలి): నేవల్‌బేస్ నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీలను వెంటనే రాష్ట్రప్రభుత్వం అందజేయాలని రాంబిల్లి మండల సీపీఎం కన్వీనర్ జి.దేముడు నాయుడు కోరారు. నిర్వాసితుల సమస్యలపై నేవల్ బేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమకు నిర్వాసితులతో కలసి సీపీఎం నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపట్నం, వాడనర్సాపురం, వాడపాలెం గ్రామాల మత్స్యకారులకు ఒక్కో బోటుకు రూ.2.50 లక్షల నష్ట పరిహారం అందజేయాలని, కొత్తపట్నం,వాడనర్సాపురం గ్రామాల్లో ప్రతి రేషన్ కార్డుదారునికి రూ.1.30 లక్షల చొప్పున అందజేయాలని ఒప్పందం జరిగినట్టు చెప్పారు. కానీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల నిర్వాసిత మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ నేవీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమకు ఆమె కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతకాయల శివాజీ, చెల్లూరి నూకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కొంతమందికి ప్యాకేజీ అందజేసినట్టు చెప్పారు. మిగిలిన వారి జాబితాను కలెక్టరేట్‌కు పంపామని తెలిపారు. మిగతా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉందన్నారు.

విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న నీరజ్‌కుమార్

పాయకరావుపేట: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని 13వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో గురువారం జరిగిన స్కూల్ కెప్టెన్, హౌస్ కెప్టెన్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి పౌరులుగా మారేందుకు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని తెలిపారు. విద్యాసంస్థసంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఎవరి భవిష్యత్‌కు వారే మార్గదర్శకులని చెప్పారు. బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తే ఎవరికీ జవాబు దారీ తనంగా ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి ముఖ్య అతిథి నీరజ్‌కుమార్ గౌరవ వందనం స్వీకరించారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి వినతి



విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించాలంటూ కొరుప్రోలు సబ్‌స్టేషన్ అధికారులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కొంత కాలంగా తరచూ విద్యుత్ కోతలుంటున్నాయని, వేళాపాళాలేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని వారు తెలిపారు. దీంతో చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే సమస్య పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ కొవిరి బంగారి, గ్రామస్తులు చోడిపల్లి బంగారి,మైలపల్లి అప్పలరాజు,ఎరిపల్లి రమణబాబు తదితరులు ఉన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సుల రాకపోకలు ప్రారంభం



యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌కు వచ్చిన అమలాపురం-మద్దిలపాలెం ఎక్స్‌ప్రెస్ బస్సు

యలమంచిలి రూరల్: యలమంచిలి బస్టాండుకు పదిహేనేళ్ల తర్వాత గురువారం నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. మొత్తం ఆరు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను యలమంచిలి బస్ కాంప్లెక్స్ మీదుగా నడపాలని ప్రజారవాణా శాఖాధికారులు ఇటీవల నిర్ణయించారు.ఈ మేరకు గురువారం నుంచి ఆయా ఎక్స్‌ప్రెస్ బస్సులు యలమంచిలి పట్టణం మీదుగా రాకపోకలు సాగించాయి.పట్టణానికి సమీపంలో కొక్కిరాపల్లి రైల్వేగేటు వద్ద అసంపూర్తిగా ఉండిపోయిన ఆర్‌వోబీ(పై వంతెన) కారణంగా 15 సంవత్సరాలుగా పట్టణం మీదుగా ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పైవంతెన పనులు పూర్తవడంతో పట్టణానికి చెందిన పలువురు విశ్రాంత ఉద్యోగులు,సీనియర్ సిటిజన్లు యలమంచిలి బస్టాండుకు ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.ఈ సమస్య స్థానిక ఎమ్మెల్యే సుందర విజయ్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రజారవాణా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విశాఖపట్నం, మద్దిలపాలెం, మధురవాడ డిపోలకు చెందిన ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను రాకపోకలు సాగించేలా విశాఖ ప్రజారవాణాధికారి ఆదేశాలు జారీచేశారు. దీంతో యలమంచిలి బస్ కాంప్లెక్స్ మీదుగా రాకపోకలు ప్రారంభమయ్యాయి.

మత్స్యకారులను ఆదుకోవాలని వినతి



రవితేజకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, మత్స్యకారుల సంఘం నాయకులు

అచ్యుతాపురం: మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం,మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక మత్స్యశాఖ అధికారి రవితేజకు వినతి పత్రం అందజేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార భరోసా రూ.20 వేలను అర్హులైన మత్స్యకారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఏర్పడిన వాయుగుండం వల్ల వర్షాలు కురవడంతో వారం రోజుల పాటు వేటకు దూరమైన మత్స్యకారులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము, దేవనాయుడు, చేపల తాతయ్య, చెల్లూరి నూకన్న, మైలపల్లి రమణ,కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం



అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో అచ్యుతాపురం జంక్షన్ వద్ద గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, పోలవరం ఇలా అన్ని విషయాల్లోనూ అన్యాయం చేశారని చెప్పారు. అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని కోరారు. ర్యాలీలో సీపీఎం నాయకులు దేముడునాయుడు, చింతకాయల శివాజీ, కూండ్రపు సోమునాయుడు, నూకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.